క్లుప్తంగా

మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలి



మార్కెట్‌లో సౌకర్యాలపై స్థానికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: టవర్‌సర్కిల్‌లోని ప్రధాన కూరగాయల మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలని చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అధికారులను ఆదేశించారు. మంగళవారం మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాపారులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలని, అలాగే రోడ్లపై ఎలాంటి సామాన్లు పెట్టి విక్రయించకుండా ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. ఆమె వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

కార్మికుడికి పరామర్శ

మున్సిపల్ కార్మికుడిగా పనిచేస్తున్న శ్రీహరి అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా, మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట నాయకులున్నారు.

ఉపాధ్యాయురాలికి నంది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శ్రావణి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న మారంపల్లి శ్రావణి సామాజిక సేవా రంగంలో ఆమె సేవలను గుర్తించి శిఖర ఆర్ట్స్ వారు రాష్ట్రస్థాయి నంది ప్రతిభా పురస్కారంతో సత్కరించారు. శ్రావణి విద్యార్థుల ప్రగతితో పాటు, వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో సామాజిక సేవలను గుర్తించిన హైదరాబాద్ శిఖర ఆర్ట్స్ వారు సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నంది పురస్కారాలతో సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఉప్పులేటి సరేశ్, ప్రముఖ సినీ దర్శకులు అల్లాణి శ్రీధర్, ప్రేమ్ రాజ్, అక్షర కుమార్, కథా రచయిత భారవి, సినీ కథా రచయిత మల్లిక్, సినీ నటులు అశోక్ కుమార్, ఆనంద చక్రపాణి పాల్గొన్నారు.

యువతను బీజేపీ విస్మరించింది



మాట్లాడుతున్న కసిరెడ్డి మణికంఠ

జగిత్యాల/కోరుట్ల: బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా విద్యార్థులను, యువతను విస్మరించిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ అన్నారు. జగిత్యాల,కోరుట్లలో మంగళవారం మాట్లాడారు. ఏడాది 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు.నూతన జాతీయ విద్యావిదానం తెచ్చి విద్యారంగాన్ని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. దేశంలో యువత డ్రగ్స్, గంజాయి, విచ్చలవిడిగా వినియోగిస్తున్నా అరికట్టటంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులు డ్రగ్స్,గంజాయిని విద్యార్థులు తరిమికొట్టాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ హటావో, దేశ్‌కి బచావో అనే నినాదంతో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సమీర్ జిల్లా కార్యదర్శి అక్రమ్, శివసాయి, రాహుల్, నాగరాజు, ఎండీ గని, మణింద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతి..



ప్రమాదకరంగా వంతెన అప్రోచ్ రోడ్డు

మేడిపల్లి: గతేడాది కురిసిన భారీ వర్షాలకు కమ్మరిపేట–వెంకట్రావుపేట మధ్య వంతెన తెగిపోయి ప్రమాదకరంగా మారింది. అప్పట్లో అరకొర మరమ్మతులు చేసి వదిలేశారు. తర్వాత బ్రిడ్జిని పట్టించుకునే నాథుడే లేకపోయారు. ఈ భీమారం మండలానికి వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారడంతో కేవలం చిన్న వాహనాలే వెళ్తున్నాయి. భారీ వాహనాలు కాచారం బైపాస్ నుంచి పోవాల్సి వస్తోంది.వెంటనే కొత్త బ్రిడ్జి నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నీడలేక.. నిలబడ చోటు లేక..

- తాగునీటికి ఇబ్బందులు
- మారని పాతబస్టాండ్ దుస్థితి
- పట్టించుకోని పాలకవర్గం



మంచినీటి కోసం వేసిన షెడ్డు



పాత బస్టాండ్ పరిసరాల్లో దుకాణం వద్ద కూర్చున్న ప్రయాణికులు

రాయికల్: పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాలకు చెందిన ప్రయాణికుల సౌలభ్యం కోసం రాయికల్‌లో పాత బస్టాండ్ ఏర్పాటు చేయగా పాత బస్టాండ్‌లో సరైన సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాయికల్ మున్సిపాలిటీగా మారి ఐదేళ్లు గడుస్తున్నప్పటికీ పాతబస్టాండ్‌లో మాత్రం ఏలాంటి సౌకర్యాలు కల్పించ లేదు. షెడ్డు నిర్మాణం లేకపోవడంతో ఎండాకాలంలో ఎండకు, వర్షాకాలంలో వర్షాలకు ఇబ్బందులు పడుతూ పాతబస్టాండ్‌లోని పరిసర దుకాణాల్లో కూర్చోవాల్సిన దుర్భర పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్ హయాంలో సింగరేణి ప్రత్యేక నిధుల ద్వారా మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు షెడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు కోసం ప్రయత్నించారు. అధికారులు ప్రతిపాదనలు పంపించడంలో ప్రత్యేక చొరవ చూపకపోవడంతో పాటు నిధుల మంజూరుకు మోక్షం లభించలేదు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించి పాత బస్టాండ్‌లో తాత్కాలిక షెడ్డు నిర్మాణం చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

తాగునీటికి ఇబ్బందులు..

రాయికల్ మున్సిపాలిటీలోని పాతబస్టాండ్‌లో గాంధీచౌక్, శివాజీ ఏరియా తదితర ప్రాంతాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏటా మున్సిపాలిటీల్లో చలివేంద్రం ఏర్పాటు చేస్తుండగా, ప్రస్తుతం చలివేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో తాగునీరు కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దుకాణాల వద్ద కూర్చుంటున్నారు



ఎన్ని ప్రభుత్వాలు మారినా పాత బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించడం లేదు. ప్రయాణికుల సౌకర్యం కోసం షెడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో వారు దుకాణాల వద్ద కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షానికి, ఎండకు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– గరిపెల్లి శ్రీనివాస్ ,వ్యాపారి

చలివేంద్రం ఏర్పాటు చేస్తాం



రాయికల్ మున్సిపాలిటీలోని పాతబస్టాండ్, గాంధీచౌక్, శివాజీ ఏరియాల్లో మున్సిపల్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తాం.షెడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. నిధుల మంజూరుకు మున్సిపాలిటీ నుంచి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. నిధులు మంజూరు కాగానే సౌకర్యాలు కల్పిస్తాం.

– జగదీశ్వర్‌గౌడ్, కమిషనర్

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళి



జగిత్యాలలో నివాళి అర్పిస్తున్న నాయకులు



రాయికల్ మండలం ఇటిక్యాలలో..





ఇబ్రహీంపట్నం, అయిలాపూర్‌లో నివాళి అర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

జగిత్యాలటౌన్/రాయికల్/ఇబ్రహీంపట్నం/ కథలాపూర్/మల్లాపూర్/ధర్మపురి/కోరుట్ల రూరల్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న అని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏటీఎం ఆస్పత్రిలో నిర్వహించారు. సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాయికల్ మండలంలోని ఇటిక్యాల గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఇబ్రహీంపట్నంలో కొత్త బస్టాండ్ వద్ద పాపన్న విగ్రహానికి జిల్లా గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి చెట్లపెల్లి సత్యనారాయణగౌడ్ అధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండలంలోని గొధూర్, డబ్బా గ్రామాల్లో పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కథలాపూర్‌లో సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. మల్లాపూర్ మండలంలోని సాతారంలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమాల్లో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి మండలంలోని నేరెల్లలో మంగళవారం సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ మహారాజ్ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. కోరుట్ల మండలంలోని అయిలాపూర్, సంగెం, యూసుఫ్‌నగర్ గ్రామాలతో పాటు పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో సర్వాయి పాపన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి



బోరును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో రఘువరన్

ఇబ్రహీంపట్నం: ఎండాకాలం గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళికలను తయారు చేసుకోవాలని జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి రఘువరన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని, ధాన్యం కొనుగోలు కేంద్రం, రైతు వేదికను ఇబ్రహీంపట్నంలో నీటి వసతులపై అకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్యకేంద్రంలో స్టోర్‌లోని మందులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి ధాన్యం కొనుగోలు చేయుటకు సిద్ధంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. పినుగుల గుట్ట వద్ద ఇటీవలనే వేసిన బోర్‌ను , ఎస్సీ కాలనీలోని హ్యాండ్‌బోర్‌ను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీల ప్రత్యేకాధికారులు, పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎండకు బయటకు వెళ్లేటప్పుడు వడదెబ్బ తగలకుండా ఉండేందుకు గ్రామపంచాయతీలో మైక్‌ల ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామనర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా నీళ్లు పట్టించాలని, వచ్చే హరితహారానికి మొక్కలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కృపాకర్, వైద్యాధికారి హరీశ్, ఫార్మాసిస్ట్ ఉదయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్, పంచాయతీల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లాలో పోలీస్‌యాక్ట్ అమలు

జగిత్యాలక్రైం: శాంతిభద్రతల నేపథ్యంలో జిల్లాలో ఈనెల 30వరకు సిటీ పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు పోలీసు శాఖ వారికి సహకరించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్నివర్గాల ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.

వైద్యకళాశాలలో కాంట్రాక్టు ఉద్యోగాలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేసేందుకు ఈనెల 4న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఖాద్రి తెలిపారు. ప్రొఫెసర్ పోస్టులు 5, అసోసియేట్ ప్రొఫెసర్లు 17, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 10, సీనియర్ రెసిడెన్స్ 4, ట్యూటర్స్ 11 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు హాజరుకావాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల గ్రామశివారులో మంగళవారం రాత్రి పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు చేయగా, ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ కనిపించారని, వారి వద్ద నుంచి రూ. 20,020 స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం శివారులోని ఎల్లమ్మ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని గౌడ కులస్తులు తెలిపారు. మంగళవారం ఆలయానికి సున్నం వేయించేందుకు వెళ్లిన తమకు తాళాలు పగిలిపోయి కనిపించాయన్నారు. దుండగులు హుండీలోని రూ.6 వేలు ఎత్తుకెళ్లినట్లు గౌడ సంఘం అధ్యక్షుడు చెట్లపల్లి సత్యనారాయణగౌడ్ పేర్కొన్నారు. ఈ ఘటనపై ఎస్సై అనిల్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సిగ్నల్ లేక వీడియో కాన్ఫరెన్స్‌కు అంతరాయం



ఖాళీగా కూర్చున్న రైతులు, అధికారులు

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలు వీడియోకాన్ఫరెన్స్‌లో రైతులకు వివిధ పంటలపై అవగాహన కల్పించాల్సి ఉండగా, ఇంటర్‌నెట్ పనిచేయక పోవడంతో రైతులు శాస్త్రవేత్తల అవగాహన కార్యక్రమాన్ని చూడలేకపోయారు. ఇంటర్‌నెట్ పనిచేయకపోవడంతో టెక్నిషియన్‌కు సమాచారం ఇచ్చినట్లు ఏవో దీపిక తెలిపారు.

సమగ్ర పోషక యాజమాన్యంపై రైతులకు వీడియో కాన్ఫరెన్స్

సారంగాపూర్: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతునేస్తం కింద రైతులకు సమగ్ర పోషక యాజమాన్యం, స్వీట్ కార్న్, దోస సాగులో రైతుల అనుభవాలు తదితర అంశాలపై రైతులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రైతులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏవో తిరుపతినాయక్, ఏఈవో ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

రాయితీ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ధర్మపురి: పట్టణ ప్రజలు ఇంటి పన్నులు, నల్లా బిల్లులు ఈనెల 30 లోగా చెల్లించి 5 శాతం రాయితీ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఆస్తి పన్నుతో పాటు నల్లా బిల్లులు ట్రేడ్ లైసెన్స్ బిల్లులు, అడ్వటైజ్‌మెంట్ ఫీజులు సంబంధిత బిల్ కలెక్టర్‌కు చెల్లించాలని కోరారు.

యువతిని మోసగించిన వ్యక్తిపై కేసు

రాయికల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని మోసగించిన ఆల్యానాయక్‌తండాకు చెందిన బానోవత్ తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి శారీరకంగా దగ్గరయ్యాడని, తీరా పెళ్లికి నిరాకరించాడని, యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కోరుట్లలో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్



సమస్యలపై వ్యాపారిని అడుగుతున్న ఎమ్మెల్యే

కోరుట్ల: గుడ్ మార్నింగ్ కోరుట్ల కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ గడి బురుజుల వద్ద కూరగాయల మార్కెట్‌లో మంగళవారం మార్నింగ్ వాక్ చేశారు. వ్యాపారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 28 వ వార్డులోకి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జిందం లక్ష్మీనారాయణ, బట్టు సునీల్, సజ్జు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

కోరుట్లరూరల్: కోరుట్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ బుధవారం పర్యటించనున్నారు. మెట్‌పల్లి పట్టణంలోని 24 వ వార్డులో మార్నింగ్ వాక్, ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేటలో సాంబశివ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొంటారని, ఎమ్మెల్యే కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏపీఎం

కథలాపూర్: మండలంలోని బొమ్మెనలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం నరహరి మంగళవారం ప్రారంభించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని కోరారు. మండలంలో సెర్ప్ ఆధ్వర్యంలో 11 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సీసీ రాజు, వీవోఏలు వనజ, శ్రీకాంత్, మహిళ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్‌కు ఉచిత కోచింగ్

జగిత్యాల: 2024–25 విద్యాసంవత్సరంలో 100 మంది మైనార్టీ విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్‌లో ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నామని, ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమాధికారి ఆర్ఎస్.చిత్రం తెలిపారు. మహిళాఅభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్లు ఉంటాయని, ఈనెల 12న దరఖాస్తులకు చివరి తేదీ అని తెలిపారు.

చిన్నారులకు బాలామృతం పంపిణీ



బాలామృతం పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

పెగడపల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్లు బాలామృతం పంపిణీ చేశారు. పెగడపల్లి, ఆరవెల్లి, దోమలకుంట, బతికపల్లి తదితర గ్రామాల్లో గుడ్లు, పౌష్టికాహారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, మమత, రమ, శంకరమ్మ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ప్రభుత్వ విప్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న విప్, ముస్లింలు

మేడిపల్లి: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసం అని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కల్వకోటలో మంగళవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు. రంజాన్ ఉపవాస దీక్షలో ముస్లిం సోదరులతో కలిసి భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేశ్ రెడ్డి, చేపూరి నాగరాజు, యూసుఫ్, మొబిన్, ముస్లిం మైనారిటీ లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన వోడ్నాల ధర్మయ్య, నాచుపెల్లి గ్రామానికి చెందిన కోలకాని అక్షయ్ అనే బాలుడు ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాలను మంగళవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం మంగళవారం పరామర్శించి వారికి ఓదార్పునిచ్చారు. ఆయన వెంట మండల, గ్రామాల నాయకులు ఉన్నారు.

మద్యం పట్టివేత

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌లో ఓ బెల్ట్‌షాపుపై దాడులు నిర్వహించి మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మంగళవారం గ్రామంలో బెల్ట్ షాపులోని సుమారు 18 లీటర్లకు పైగా మద్యాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. నిర్వాహకుడు మెంగే సాగర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అగ్నిమాపక శాఖలో ముగ్గురికి డ్రైవర్ ఉద్యోగాలు

మల్యాల: అగ్నిమాపకశాఖలో డ్రైవర్ ఉద్యోగాలకు మండలానికి చెందిన ముగ్గురు ఎంపికయ్యారు. మండలకేంద్రానికి చెందిన బొబ్బిలి ప్రణయ్ యాదవ్, నాగుల రంజిత్, తక్కళ్లపల్లికి చెందిన బొడిగె శ్రీపాల్‌గౌడ్ ఎంపికయ్యారు. వారిని పీఈటీ సాగర్ అభినందించారు.

విద్యార్థినికి అభినందన

రాయికల్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన అక్షర సైనిక్ పాఠశాలలో ఆరో తరగతిలో సీటు సాధించినట్లు ప్రిన్సిపాల్ వేణు గోపాల్‌రావు మంగళవారం తెలిపారు. అంతేకాకుండా అక్షర నవోదయలో రాష్ట్ర స్థాయిలో ఓపెన్ కేటగిరిలో రెండోస్థానం సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని గ్రామస్తులు, పలువురు అభినందించారు.

గంగాధర్‌కు సన్మానం

మల్లాపూర్: మెట్‌పల్లి పట్టణానికి చెందిన గంగాధర్ ఇటీవల శాతవాహన యూనివర్సిటీ సంస్థ ఉత్తమ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డును యూనివర్సిటీ వీసీ మల్లేశం అందజేశారు. కాగా గంగాధర్‌ను మంగళవారం మల్లాపూర్‌లో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ శివశ్రీనివాస్, మండల అధ్యక్షుడు కనుక సంజీవ్, రీజియన్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

డీ-53కి నీటి విడుదలపై రైతుల హర్షం

సారంగాపూర్: డీ–53 కాలువకు ఎస్సారెస్పీ నీటి విడుదలపై రైతుల్లో సంతోషం వ్యక్తమవుతుందని బీర్‌పూర్, సారంగాపూర్ ఎంపీపీలు మసర్తి రమేశ్, కోల జమున అన్నారు. మంగళవారం సారంగాపూర్‌లో వారు మాట్లాడుతూ ప్రస్తుతం పంటలు చివరి దశలో ఉన్నాయని, ఈ తడితో వరి పంట చేతికి వస్తుందని వారు తెలిపారు. నీటి విడుదల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

'మానేర్' లో వార్షికోత్సవ సంబరాలు



నృత్య ప్రదర్శన ఇస్తున్న మానేరు విద్యార్థినులు

కొండగట్టు: మండలంలోని పూడూర్ మానేర్ స్కూల్లో మంగళవారం వార్షికోత్సవ వేడుకలు మానేర్ ఉత్సవ్- 24 పేరిట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డి, డైరెక్టర్లు సునీత రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల వీడ్కోలు వేడుక

కథలాపూర్: మండలకేంద్రంలోని మాస్ట్రో హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు పార్టీ మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో వేడుకలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఆట పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, హెచ్ఎం ఆకుల రంజిత్, టీచర్లు పాల్గొన్నారు.